

# మార్గదర్శి

"ఛీ! ఈ సంసారం జేసేకంటే చావుమేలు" సుభద్ర అలా అనుకోవడం అప్పటికెన్నోసారో!

ఆశల ఆకాశం చిల్లువడిపోయింది; కలల కపోతం రెక్కలు విరిగిపోయాయి; కోర్కెల సీతాకోక చిలుక నేల రాలిపోయింది. తనకు తానే బరువై నిస్తేజంగా, నర్జీవంగా అడుగు ముందుకేయడమే గగనమై చతికిలబడిపోయింది. నూరేళ్ల నిత్య వసంతాన్ని ఊహించుకుంటూ నిండు యౌవ్వనంతో కొత్త కాపురంలో అడుగుపెట్టి నెల తిరక్కుండానే రసహీనమైన బతుకుతో రాజీపడలేక పలాయన మార్గాల నన్వేషించసాగింది.

'తనేం తక్కువ? అందం-అణకువ; చదువు-సంస్కారం; తెలివి-మంచితనం... భగవంతుడన్నీ ఇచ్చాడు. కాని, మొగుడు.....

'పెళ్ళి చూపుల్లో మొదటిసారి చంద్రహాస్‌ని చూసినప్పుడు తానెంత అదృష్టవంతురాలినో అని మురిసిపోయింది.

'స్వీట్స్ తీసుకోకుండా, తినేసేటట్టు (మిగతా వాళ్లలా) తనను చూడకుండా ఉంటే 'హుందాతనం' అనుకుంది.

'పెళ్లిలో స్నేహితులతో కలసి నానా హంగామా చేస్తే అది వయసు తెచ్చిన ఆకతాయితనంగా సరిపెట్టుకుంది.

'కాని, శోభనం రోజు....

'తలచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది. ఆరోజును గురించి తానెన్ని ఊహించుకుంది? ఆ విశాలమైన గుండెలమీద తలపెట్టి ఏవేవో ఊసులాడాలనుకుంది. చంద్రబింబం లాంటి మోమును చేతుల్లోకి తీసుకుని, కళ్లపై, నుదుటిపై.... పెదాలపై సున్నితంగా ముద్దులు పెట్టుకోవాలనుంది.

'రాత్రంతా తన మనోభావాల్ని అతనితో పంచుకుంటూ, తనను తాను మనఃపూర్వకంగా సమర్పించుకొని మధుర స్మృతులన్నీ మూటగట్టుకోవాలనుకొంది.

'కాని, ఆరాత్రి కాళరాత్రే అయ్యింది. భయంతో విలవిల్లాడే జింకపిల్లను చుట్టుకుపోయిన కొండచిలువలా అతను, కోరికలతో కాలిపోతున్న కొరకాసుని కౌగిలించుకున్న శలభంలా తను. ఆలోచనలూ ఆశలన్నీ దగ్ధమౌతుంటే బేలగా, దీనంగా, మూగగా.... గడియారం ముల్ల సాక్షిగా ఆ ఎనిమిది గంటలూ లెక్కపెట్టుకున్నది.

'తను చదువుకున్నదే అయినా కార్యేషుదాసి, శయనేషు రంభ, భోజ్యేషు మాతలా, ఉత్తమ ఇల్లాలిగా గుర్తింపూ, గౌరవం పొందాలనుకుంది. కాని, యాంత్రిక యుగాన్ని తలదన్నే యంత్రంతో... ఛీ!

'పెళ్ళి కాగానే అత్తవారింట్లో, పెద్దల చాటున ఉంటే వాళ్ల స్వభావాలు అర్థమయ్యాక, ఎవరితోనో విషయం చెప్పుకొని కాపురాన్ని దిద్దుకునే ప్రయత్నం చేసేదేమో, కాని పుట్టింటికి, మెట్టినింటికీ దూరంగా, పెనిమిటి అనే రాకాసి యంత్రం తోడుగా హైదరాబాద్ జానారణ్యంలో అపార్ట్‌మెంట్ కొండ గుహల్లో, నిత్యం రణగొణ ధ్వనుల మధ్య ఏకాంత నిశ్శబ్దం బతుకు.

' ఏం చెయ్యాలి? ఎవరికి చెప్పుకోవాలి?' భవిష్యత్తంతా పజిల్‌గా మారగా, రాత్రిపూట నిద్రలేక, పగలు నిద్రరాక, కళ్లలోని వత్తులు మండుతుంటే ఆలోచనల ముళ్ల మధ్య మసలుతూ అస్పష్టమైన నిర్ణయాలకో స్పష్టమైన రూపం కోసం వెతుక్కో సాగింది సుభద్ర.

★ ★ ★

''ఛీర్స్!'' సూర్యతేజ, సతీశ్, చంద్రహాస్ కోరస్‌గా పెగ్గులు తాకించారు.

'' ఐ రియల్లీ కంగ్రాట్యులేట్ యూ చంద్రా! యు ఆర్ ద రియల్

మాన్!'' సిప్ చేస్తూ మనః పూర్వకంగా అభినందించాడు సతీశ్. పెళ్ళిం తర్వాత మిత్రులకు మందు విందునిస్తున్న చంద్రహాస్ నుద్దేశ్యించి.

''అంటె, ఇన్నాళ్లూ వాడ్ని ఒక మాన్‌గా ట్రీట్ చేయలేదన్నమాట!'' తను మాట్లాడే ప్రతిమాటల్లో కొంత లాజిక్, శ్లేష ఉండాలనే తాపత్రయం సూర్యతేజది.

ముగ్గురూ ఓకలర్ ప్రాసెసింగ్ ప్రైవేట్ కంపెనీలో కొలీగ్స్. రవితేజ టెక్నీషియన్. సతీశ్ క్లర్క్. చంద్రహాస్ ఎక్సిగ్యూటివ్ ఆఫీసరు. సంపాదనలో అందరికీ ఆరువేలపైమాటే సతీశ్ ముగ్గురిలో పెద్ద. ఇద్దరు పిల్లల తండ్రి. సూర్యతేజకింకా పెళ్ళి కాలేదు. అతనింట్లోనే ప్రస్తుత సమాగమం.

''యుసీ మిస్టర్ తేజా! యు ఆర్ ఎ ఛైల్డ్ ఇన్ ఫ్రంట్ ఆఫ్ అజ్. యు హేవ్ నో ఎక్స్‌పీరియన్స్ ఎటాల్! యుడోంట్ నో వాటీజ్ మాన్ అండ్ మాన్లీనెస్స్. సో! కీప్ క్వైట్ అండ్ కామ్ మై బోయ్!'' వేగంగా నాలుగో సిప్ లాగుతూ రవితేజను మందలించాడు సతీశ్.

''ఛోడోనాయార్! లెటజ్ ఎంజాయ్ దిస్ అకేషన్ ప్లీజ్!'' పరిస్థితి సీరియస్‌గా మారే ప్రమాదాన్ని పసిగట్టి, ముందే నివారించే ప్రయత్నం - చంద్రహాస్.

''నో! నో! అయామ్ నాట్ సీరియస్ మిస్టర్ చంద్రా!'' సతీష్ గొంతులో అపాలజీ.

''అరె ఇందులో సీరియస్ గాటానికే ముందన్నా? ఎంతైనా మీరు ఎక్స్‌పీరియెన్స్‌డ్ గదా!''మామూలుగా అన్నా, తన సిద్ధాంతం వదల్లేదు తేజా.

కొద్దిసేపు గ్లాసలు చప్పుడు, సిగరెట్ పొగ, ఐస్ బబుల్స్ గలగల మాటల లోటునుభర్తీ చేసే ప్రయత్నాన్ని చేయసాగాయి.

'చంద్రా! పర్సనల్ అనుకోకుంటే కొంచెం ఫ్రీగా మాట్లాడుకుందాం! ఓకే!' ఫ్రాంక్‌గా అడిగాడు రవి.

''టుబి ఫ్రాంక్ యార్! మనమధ్య పర్సనలేంటి? ఎంత పచ్చివైనా అడగొచ్చు''- చంద్ర.

''అంత బ్యూటిఫుల్ ఫిగర్‌ని ఎలా సెకెల్ట్ చేసుకున్నావ్ గురూ? మీ రిలేటివ్‌సా?'' (చంద్రబోస్ భార్యనుద్దేశించిన ప్రశ్నే అది అని అర్థం చేసుకోవాలి మనం) - రవి.

''నోయార్! కొత్తే. నేనొక్క బ్యూటినెస్ మాత్రమే చూడలేదు. ఆ అణకువ, ఎడ్యుకేషన్ ఎట్సెట్రా. మరో లక్కీ విషయమేమిటంటే మా మామగాడు మంచి''సౌండ్''. అఫ్‌కోర్స్, అవసరమైతే తప్ప వాడి సౌండ్‌తో

మనకు సంబంధంలేదనుకో. బట్ రియల్లీ ఐ లైక్ సుభద్ర! ఎ వండర్‌ఫుల్ పర్సనాలిటీ!'' తలచుకుంటూ మైమరచిపోయాడు చంద్ర.

''నాక్కూడా వరంగల్ ఏరియాలో ఓ అమ్మాయిని చూసెయ్ గురూ!'' మంచి తరుణం మించిన దొరకదన్నంత ఆత్రంగా అడిగాడు తేజా.

''ఓకే యార్! లెటస్ ట్రై'' మెల్లగా ఐస్ బబుల్ గ్లాస్‌లోకి జారవిడుస్తూ - చంద్ర.

''బట్ వన్ థింగ్ మిస్టర్ చంద్రా! నీ అధికారమంతా మెయిన్ హాల్లోనేనా, బెడ్‌రూమ్‌లోకూడా''- సతీష్.

నవ్వబోతే పొలమారింది తేజాకి.

''దేఖో యార్! హమ్ ఒరిజినల్ మగాడు హై!, మొగుడూ హై! ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్ ఇప్పటి వరకూ సుభద్ర నాకళ్లలో కళ్లు బెట్టి చూళ్లేదు. మాట్లాళ్లేదు. అండర్ స్టాండ్?'' గర్వం తొణికిసలాడింది-చంద్ర.

''అంటే మీ మధ్య ఇంకా - కనెక్షన్ షురూ గాలేదా?'' ఆశ్చర్యం గా తేజా

''అరె ఓ నహీ యార్!'' వెంటనే అందుకున్నాడు చంద్ర.

''మనం ఏం చెబితే అది, మన అభిరుచిని బట్టి వంటచేయాలి. ఆలోచనలు బట్టి పక్కలో మసలుకోవాలి'' ఇంకాస్త రెచ్చిపోయాడు. ''లైట్ ఉంచమంటే ఉంచాలి. తియ్యమంటే తియ్యాలి. హాఫ్ అంటే హాఫ్, ఫుల్ అంటే ఫుల్ గా ఉండాలి!''.

సతీష్ చేతిలోని గ్లాసు జారి పడకుండా భద్రంగా పట్టుకున్నాడు. ''అంటే... యుమీన్... ఎప్పుడూ ఎదురు చెప్పదా?'' మొట్టమొదటిసారి ఓ కొత్త విషయం వింటున్న ఫీలింగ్ సతీష్‌లో.

''హాష్ట్! ఎదురా! మాట్లాడనిస్తే గద యార్! ఇంట్లో పాత్రల చప్పుడే గాని, మనుషుల చప్పుళ్లుండవ్!'' అదే గర్వం - చంద్ర.

''యు ఆర్ రియల్లీ గ్రేట్ గురూ!'' కాళ్ల మీద పడిపోయాడు సతీష్.

'' అరె, అరె, భయ్యా! ఏ క్యాహై? ఆప్ హమ్ సే బడే హోకర్...'' కంగారు కంగారుగా కుర్చీలో కూర్చోబెట్టాడు చంద్రహాస్. రవితేజ. సహకరించాడు.

''రియల్లీ చంద్రా! నాలుగేళ్ళ క్రితం నేనూ నీలాగే ఆలోచించి ఉంటే...'' ప్రస్తుత పరిస్థితిని తలచుకుంటూ చంద్రహాస్‌తో బేరీజు వేసుకొని బేజారైపోయాడు.

''కూల్ డౌన్ భయ్యా! ఇంతమంది ఎక్స్‌పీరియన్సెస్ చూస్తూ కూడా పెళ్ళాన్ని కంట్రోల్లో పెట్టుకోకపోతే... నాన్సెన్స్! గబుక్కున గ్లాసులో మిగిలిందంతా ఒంపేసుకున్నాడు గొంతులోకి చంద్ర.

పెళ్లాం అనగానే ఇల్లు గుర్తుకొచ్చింది సతీష్‌కి రిస్ట్ చూసుకోగానే సగం మత్తు దిగిపోయింది. అప్పటికే పదకొండున్నర. ''ఓకే ఫ్రెండ్స్! లెటజ్‌గో'' అంటూ కొక్కేకేసిన షర్టు తీసి తగిలించుకోసాగాడు.

''హలో భయ్యా! ఒక్కరౌండ్... పూర్తయిపోయింది'' అంటున్న చంద్రహాస్‌ని పట్టించుకోకుండా బయటి కెళ్లిపోయాడు.

''భార్యా విధేయుడన్నా, పోనీ పాపం! మనకెందుకు ఉసురు?'' అంటూ సీసాలో మిగిలిన భాగాన్ని ఇద్దరి గ్లాసుల్లోకి సమానంగా వంచాడు - రవి తేజ.

★ ★ ★

అర్థరాత్రికి సమాంతర రేఖలాంటి రోడ్డుపై ''మగాడంటే అధికుడు. మొగుడంటే ఆరాధనీయుడు'' అనే తన సిద్ధాంతం సీటు మీద ''హీరో హోండాపై నెమ్మదిగా సాగిపోతున్నాడు చంద్రహాస్.

మిగిలిన రాత్రి సుభద్రతో ఎలా గడపాలో పచ్చిగా ఊహించుకుంటూ, పెళ్లికి ముందు మిత్రులు చెప్పిన మాటలు గుర్తు చేసుకూంటూ...

''నీ జోరు మాకు తెలుసులేవోయ్. ఇదంతా శోభనం దాకే. పులిలాంటి మగాడైనా ఆ ఒక్కటీ అయ్యాక పెళ్లాం దగ్గర పిల్లే.''

'' ఆడది అదుపులో ఉన్నంతవరకే ఆలి. అదుపు తప్పితే గయ్యాళి''

''గాజుల పెత్తనం గడపకు చేటు''.

''పైకి కనిపించే అందమైన నీ మీసాలకన్నా కనిపించకుండా శాసించే ఆడదాని అందాలే గొప్పవిరా!''

''కడివెడంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువే. నువ్వు కత్తిపీటవో, గుమ్మడికాయవో నీవే నిర్ణయించుకో''

'నేనెప్పుడూ కత్తినే' - మనసులోనే అనుకుంటూ బండికి స్టాండ్ వేశాడు చంద్రహాస్.

డోర్‌ని మెత్తగా నాక్ చేశాడు.

తెరుచుకోలేదు.

నాలుగుసార్లు క్రమేపీ సౌండ్, స్పీడూ పెంచితే గాని ఫలితం దక్కలేదు.

నిగ్రహం, ఆగ్రహంగా మారడానికి ఆసమయం ఎక్కువే అయింది. తెరిచిన తలుపులో కనిపించిన సుభద్ర విగ్రహంలోని అందం, అమాయకత్వం కంటే ముందు అలసత్వమే సాక్షాత్కరించింది.

''ఛీ!''

★ ★ ★

'చంద్రా! చంద్రా!'ఎక్కడో విన్న పిలుపు. బాగా పరిచయమైన పిలుపు. పూర్తిగా మత్తు దిగని చంద్రహాస్‌కి కళ్లు బరువుగా, మంటగా ఉన్నాయి. ఆ స్వరం మరొకరిదైతే కోపంతో ఒళ్లు తెలిసేది కాదు. కాని, నాద స్వరాన్ని కాదనలేని నాగుపాములా మెల్లిగా లేచాడు. తల విదిలించాడు. ఒళ్లు విరుచుకున్నాడు. కళ్లు తెరిచాడు. తనుచూస్తుంది. కలో నిజమో అర్థం కావడంలేదు. నోరు తెరచి ఏదో అనబోయేంతలో.

''ఛీ!'' గూబ పగిలిపోయింది.

''అమ్మా!'' కోపం-భాధా కలగలిసాయి చంద్రహాస్ గొంతులో.

''ఛీ! ఆ పేరుతో నన్ను పిలవకు. తండ్రిలేని లోటు కనబడనీయకుండా ఈ గుండెల్లో పెట్టుకొని పెంచుకున్న నాకు గుండె కోతను తెచ్చిపెట్టావు కదరా!

''మగతనమంటే ఆడదాని మీద పెత్తనం చెలాయించడం కాదురా! కష్టాల్లో నలుగురిని ఆదుకోవాలి! మగసిరి అంటే పశువాంచతో పెట్రేగిపోవడం కాదురా! మంచితనంతో హృదయాన్ని స్వాధీనం చేసుకోగలగాలి!

''నిన్న మధ్యాహ్నం పలకరించి పోదామని నేనొచ్చేసరికి, ఈ ఇంటి లక్ష్మి గడపదాటి వెళ్లేందుకు సిద్ధంగా ఉంది. విషయమంత చెప్పింది. నీ పశుప్రవృత్తికి గుర్తులు కూడా చూశాను. అప్పుడే సిగ్గుతో చితికిపోయాను. రాత్రి నీ నిర్వాకం చూశాక...''

''ఛీ! అప్పుడే నిలదీయాలనుకున్నాను. కాని, తాగిన మత్తులో తల్లినే కాదంటావేమో నన్న అనుమానంతో ఇంతసేపూ ఓపికపట్టక తప్పలేదు.

''నాకు తెలుసు, ఇది నీ సహజమైన బుద్ధికాదని. ఎదుటి మనిషిని అర్థం చేసుకోగలిగే నీకు భార్యను అర్థం చేసుకోగలిగే శక్తి ఉందనే నమ్ముతున్నాను. అందుకే పుట్టింటికెళ్ళాల్సిన సుభద్రను మన యింటికి తీసుకెళ్తున్నాను. గౌరవించగలిగే జ్ఞానోదయమైన నాడు ఇంటికిరా!''

అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న లగేజిని ఒక చేత్తో పట్టుకొని, కోడలి భూజం మీద చేయి వేసి నడిపించుకొని బయటికెళ్లింది లక్ష్మి.

ఆరాధనతో కళ్లు చెమర్చాయి సుభద్రకి.

తల్లినీ, ఇల్లాలినీ చూస్తూ నిశ్చేష్టుడిగా ఉండిపోయాడు చంద్రహాస్.